క్లుప్తంగా

రేపటి నుంచి ఏసీ, ఫ్రీజర్ మరమ్మతుల్లో శిక్షణ

టంగుటూరు: జిల్లా గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఏసీ, ఫ్రీజర్ రిపేర్లలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒంగోలు భాగ్యనగర్‌లో 2023 ఆగస్టు 3 నుంచి సెప్టెంబర్ వరకు 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తామని, ఆ సమయంలో భోజనం, వసతి పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు పేర్లు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. వివరాలకు 9573363141ను సంప్రదించాలని సూచించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పీసీపల్లి: 40శాతం కలిగిన వికలాంగుల సబ్సిడీ రుణాలను దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసరావు తెలిపారు. వికలాంగుల తమ జీవనోపాధి కోసం ప్రభుత్వ సబ్సిడీతో కూడిన రుణాలు సుమారు రూ. 50వేల నుంచి రూ. 5 లక్షల వరకు అందిస్తామన్నారు. జిల్లా కమిటీ ద్వారా ఎంపిక చేసిన వారికి ఈ రుణాలను అందిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సంబంధిత ధృవపత్రాలతో మున్సిపల్ కార్యాలయంలో గానీ, ఎంపీడీఓ కార్యాలయంలో గానీ సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై పరిశీలన

కందుకూరు రూరల్: స్వచ్ఛ సర్వేక్షణ్ జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా మండలంలోని జిల్లెళ్లమూడి గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వ టీమ్ మంగళవారం పరిశీలించింది. గ్రామంలో ఇంటింటికీ తిరిగి గ్రామస్తులను అడిగి పారిశుధ్య చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. పారిశుధ్యం, సైడు కాలువలు, మరుగుదొడ్లు, గ్రే వాటర్, అండర్ డ్రైనేజీ, నీటి కుళాయిలు, ఓవర్ హెడ్ ట్యాంక్, అంగన్‌వాడీ కేంద్రం, రహదారులు, చెత్త నుంచి సంపద కేంద్రం, వీధి లైట్ల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. డీపీఓ కార్యాలయం నుంచి శ్రీనివాస్, కేంద్ర తనిఖీ బృందం వేణుగోపాల్, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ ఎం.రమణయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను బెదిరించిన మహిళపై కేసు నమోదు

సింగరాయకొండ: మండలంలోని కనుమళ్ల పంచాయతీ చిన్న కనుమళ్ల గ్రామంలోని స్థల వివాదంపై ఇరువర్గాలతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సమయంలో ఒక వర్గానికి చెందిన కోమటిరెడ్డి కోటేశ్వరి తనతో అమర్యాదగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించినట్లు తహసీల్దార్ సీహెచ్ ఉష ఫిర్యాదు చేయడంతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహ నిర్మాణాలు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

పీసీపల్లి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని గుదేవారిపాలెం సచివాలయం పరిధిలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు మంగళవారం పరిశీలించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం పీసీపల్లి వైద్యకేంద్రంలో డీ వార్మింగ్ శిక్షణా సమావేశాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ శ్రీనివారెడ్డి, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

పామూరు: ప్రభుత్వం హమాలీ ముఠా కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డ్, సంక్షేమ నిధి ఏర్పాటుచేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ కార్మికులకు పనిభద్రత, గుర్తింపుకార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయాలు కల్పించాలన్నారు. పి.శ్రీను, వెంకట్రావు, శ్రీనివాసరావు, సాంబశివరావు, కోటి, సీహెచ్ వెంకటేశ్వర్లు,రామ్మోహన్ పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్లు తీసుకెళ్లద్దని గ్రామస్తుల నిరసన

కనిగిరి రూరల్: మట్టి ట్రాక్టర్లను గ్రామంలోని దారి నుంచి తీసుకెళ్లద్దని శంఖవరం గ్రామస్తులు మంగళవారం నిరసన తెలియజేశారు. గార్లపేట రోడ్డులో ఉన్న క్వారీల నుంచి తరలిస్తున్న క్వారీ మట్టిని ట్రాక్టర్ల ద్వారా గ్రామంలో నుంచి తీసుకెళ్లడంతో ఇళ్లల్లోకి దుమ్ము ధూళి పడుతుందని గ్రామస్తులు ఆరోపించారు. ట్రాక్టర్ల రద్దీతో రోడ్డు ఛిద్రమవుతున్నట్లు తెలిపారు.

రేపు నిరసన ప్రదర్శన

కందుకూరు: మణిపూర్‌లో జరుగుతున్న హింసను అరికట్టాలని, క్రైస్తవులపై దాడులను నివారించాలని కోరుతూ జేడీబీఎం టౌన్ చర్చి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో భారీ ఎత్తున శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని చైర్మన్ మట్టుపల్లి అనిల్, కార్యదర్శి చనమాల శ్రీధర్ తెలిపారు. ఏబీఎం కాంపౌండ్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రదర్శన జరుగుతుందన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం



బొట్లగూడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ, సిబ్బంది

వలేటివారిపాలెం: తల్లి పాలు బిడ్డకి శ్రేష్టమని సూపర్‌వైజర్ సునీత అన్నారు. మండలంలోని చుండి అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు మంగళవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్దాని బాషా అధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పామూరు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఏ.సృజన అన్నారు. తల్లిపాల వారోత్సవాల మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎంపీఎస్ పార్వతి, గోళ్ల పద్మజల ఆధ్వర్యంలో బొట్లగూడూరు, వగ్గంపల్లె సెక్టార్ పరిధిలోని మోట్రావులపాడులో నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులు, చిన్నపిల్లల తల్లులకు అవగాహన కల్పించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.సృజన మాట్లాడుతూ పిల్లలకు కనీసం 6 నెలలవరకు విధిగా తల్లిపాలే ఇవ్వాలన్నారు. ఎంపీటీసీ యం.ఆదిలక్ష్మి, సర్పంచ్ మెడబలిమి గురవయ్య, అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బలక్ష్మి, జియంఎస్‌కే యం.సరోజిని, రత్తమ్మ, పాల్గొన్నారు.

గుడ్లూరు: తల్లిపాలపై తల్లులకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి మారుతీరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగనిరోధక శక్తిని పెంచే తల్లిపాల ఆవశ్యకత గురించి తల్లులకు తెలియజేయాలన్నారు. వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీహెచ్‌ఓ భాస్కరరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నలూరు: స్థానిక ఎస్సీ కాలనీలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ చేపట్టి పంచాయతీలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ప్రసవించిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టిస్తే రోగ నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె అనురాధ, గౌసియా, మధురవాణి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



చుండిలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సునీత



మాట్లాడుతున్న వైద్యాధికారి మారుతీరావు

ఓటరు సర్వేలో అప్రమత్తత అవసరం



ఓటరు సర్వేపై బీఎల్‌ఏలకు దిశానిర్దేశం చేస్తున్న వరికూటి

- బీఎల్‌ఏలకు వరికూటి అశోక్‌బాబు దిశానిర్దేశం

సింగరాయకొండ: సార్వత్రిక ఎన్నికల్లో అతి ముఖ్యమైన ప్రక్రియ అయిన ఓటరు సర్వేపై బీఎల్‌ఏలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలే తప్ప అలసత్వం ప్రదర్శించవద్దని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఓటరు సర్వేపై బీఎల్‌ఏలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వరికూటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో టీడీపీ వారు గతంలో చేర్పించిన దొంగ ఓట్లు 65 శాతం పైగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా టంగుటూరు మండలం నాయుడుపాలెం, సూరారెడ్డిపాలెంలో దొంగ ఓట్లు బయటపడ్డాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఓటరు సర్వేపై బీఎల్‌ఏలు దృష్టి సారించినట్లయితే సుమారు 10 వేలకు పైగా టీడీపీ నేతలు చేర్పించిన దొంగఓట్లు తొలగించటానికి అవకాశం ఏర్పడి, అసలైన ఓటర్ల జాబితా తయారవుతుందని చెప్పారు. ప్రతి బీఎల్‌ఏ ఓటరు జాబితాపై పట్టు సాధించాలన్నారు. నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో ఎక్కువగా చనిపోయిన వారు, వివాహమై ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఆడపిల్లలు, విదేశాల్లో నివసిస్తూ గ్రీన్ కార్డు ఉన్నవారు, హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో స్థిరపడిన వారు ఎక్కువగా ఉన్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి వారి ఓట్లను రద్దు చేయడానికి అధికారులకు సిఫార్సు చేయాలని సూచించారు. ప్రతి బీఎల్‌ఏ గ్రామాల్లో ఓటర్లతో సఖ్యతగా మెలగాలని, ఇతర పార్టీలకు చెందిన ఓటర్లకు ప్రభుత్వ పథకాల గురించి వివరించి వైఎస్సార్ సీపీ వైపు ఆకర్షితులయ్యేలా కృషి చేయాలన్నారు. నాయకులందరు విభేదాలను మరిచి సమష్టిగా పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీ ఏపూరి శ్రీనివాసులు, మండల జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, మాజీ ఎంపీపీ యన్నాబత్తిన మురళి, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, షేక్ సలీం, మాలె ప్రకాష్‌రెడ్డి, ముళ్లపూడి సత్యన్నారాయణ, పాస్టర్ అశోక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు నూరుశాతం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరమణ

సీఎస్‌పురం (పామూరు): రైతులు సాగుచేసిన పంటలకు ఎప్పటికప్పుడు ఈపంట నమోదు సకాలంలో పూర్తి చేయాలని కనిగిరి ఏడీఏ ఎ.వెంకటరమణ అన్నారు. సీఎస్‌పురం రైతుభరోసా కేంద్రంలో మంగళవారం ఏఓ జి.మధు అధ్యక్షతన ఈపంట నమోదులో అవలంబించాల్సిన నూతన విధానంపై వీఏఏ, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. రైతులను ఆర్బీకేలచుట్టూ తిప్పుకోకుండా ప్రభుత్వ పథకాలను రైతులకు అందించే క్రమంలో అలసత్వం ప్రదర్శించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పామూరు ఏఓ కంచం రాధ, పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల ఉద్యానవన శాఖాధికారి కె.కుసుమ, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రామక్రిష్ణ, వీఆర్‌ఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

రోగులకు, పేదలకు అన్నదానం

కనిగిరి రూరల్: పేదలకు, రోగులకు తమ వంతు సహకారంగా అన్నదానం చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. మండలంలోని ఏరువారిపల్లికి చెందిన బల్లి చిన్న బాబు ఆర్థిక సహకారంతో మంగళవారం స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆస్పత్రి సూపరిండెంట్ సయ్యద్ అబ్దుల్ కలాం, సర్పంచ్ దమ్ము వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ వీరం రెడ్డి బ్రహ్మారెడ్డి, మాజీ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్ లతీఫ్, ట్రస్ట్ నిర్వాహకుడు డీ సుధీర్ బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- డీఆర్‌డీఏ పీడీ తెళ్ల రవికూర్



సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ రవికుమార్

మద్దిపూడి: డ్వాక్రా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వనరులు సమకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ తెళ్ల రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో క్రాంతి పథం సిబ్బందితో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీ నిధి, సీఎంఎఫ్ఎంఈ, సీఏఎఫ్, ఉన్నతి ద్వారా రూ.20 వేల నుంచి రూ.10 లక్షల వరకు 37 శాతం సబ్సిడీపై డ్వాక్రా మహిళలు రుణాలు పొందవచ్చన్నారు. ప్రభుత్వం అందించే రుణాలతో డ్వాక్రా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. వలంటీర్ సర్వేను పరిశీలించారు. పడమటి బజారులో పలువురు వృద్ధులు, వితంతువులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఆయన వెంట ఏపీఎం టి.బాబురావు, వెల్ఫేర్ అసిస్టెంట్ సీత, సీసీలు రామాంజి, అంజనీకుమారి, మాధవరావు, ద్రాక్షాయనమ్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు పంచాయతీ ఎయిడెడ్ స్కూల్, గిరిజన సంక్షేమ శాఖ బాలుర, బాలికల విద్యాలయాలను కందుకూరు ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యాబోధన ఎలా చేస్తున్నారని విద్యార్థులతో మాట్లాడారు. ఎంఈఓలు ప్రసాదరావు, రమణయ్య, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎస్ఏ గౌస్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కార్మికులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఇన్‌చార్జి కమిషనర్ శ్రీరామమూర్తికి వినతి పత్రం అందజేశారు. యూనియన్ కార్యదర్శి శేషమ్మ, కమిటీ సభ్యులు వడ్డేముక్కల రవణమ్మ, ఎద్దు కొండమ్మ, యలమందమ్మ, చెన్నమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

పూరిగుడిసె దగ్ధం

- రూ.10 వేలు ఆస్తి నష్టం



వృద్ధురాలికి నగదు అందిస్తున్న చిమట శ్రీను

సింగరాయకొండ: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో గుడిసె దగ్ధమైన సంఘటన మంగళవారం పాత సింగరాయకొండ పంచాయతీ నరసింహనగర్ ఎస్టీ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కాలనీలోని గుడిసెలో వృద్ధురాలు దేవతి ఒంటరిగా నివసిస్తోంది. ఆమె పక్క గుడిసెలో కుమారుడు వేలమల్లయ్య నివసిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా గుడిసెకు మంటలు అంటుకున్నాయి. ఈ విషయం గమనించిన వృద్ధురాలు వెంటనే బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకుంది. చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పేలోగా గుడిసె పూర్తిగా కాలిపోయింది. ప్రమాదం కారణంగా రూ.10 వేలు నష్టం వాటిల్లిందని వృద్ధురాలు వాపోయింది. ఆమె దీనస్థితిని గమనించిన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిమట శ్రీను రూ.1000 నగదు, 50 కేజీల బియ్యం బస్తా అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.

ధ్యాన కేంద్రాలు ఆరోగ్య నిక్షేపాలు



పామూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ ధ్యానపరులు

పామూరు: ధ్యాన కేంద్రాలు ఆరోగ్య నిక్షేపాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ దామోదరయ్య అన్నారు. పామూరులో నూతనంగా నిర్మించిన ఆదిలక్ష్మమ్మ, శ్రీనివాస పిరమిడ్ ధ్యాన కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ధ్యానం చేయడంతో పాటు శాఖాహార భోజనం చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తి వెంకట రమణయ్య, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తిరుపతయ్య, బొంతల సత్యనారాయణ, సుధ, కోడూరి ప్రభాకర్, సౌభాగ్యం, ధనలక్ష్మి, హైమ, వాణి, శశి, పుష్ప, పందిటి అల్లూరయ్య పాల్గొన్నారు.

1523 పొగాకు బేళ్ల కొనుగోలు

కందుకూరు: కందుకూరులోని పొగాకు వేలం కేంద్రాల్లో మంగళవారం జరిగిన పొగాకు వేలంలో 1523 బేళ్లను విక్రయించారు. వీటిలో కందుకూరు–1వ వేలం కేంద్రంలో 758 బేళ్లను వేలానికి ఉంచగా 658 బేళ్లు, కందుకూరు–2 వేలం కేంద్రంలో 912 బేళ్లకుగాను 865 బేళ్లను విక్రయించారు. కేజీ పొగాకు అత్యధిక ధరలు వరుసగా రూ.270, రూ.271 పలికాయి. అత్యల్ప ధరలు రూ.160 వచ్చింది.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగవారం కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 1197 బేళ్లను తీసుకురాగా వాటిలో 1161 కొనుగోలయ్యాయి. 36 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.270, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.262.04 పలికింది.

నూరుశాతం లక్ష్యం సాధించాలి

పీసీపల్లి: నులి పురుగుల మాత్రల పంపిణీలో నూరు శాతం లక్ష్యం సాధించాలని ఎంపీడీఓ కె.శ్రీనివాసులరెడ్డి అన్నారు. వైద్యాధికారి ఎన్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ నెల 10, 17 తేదీల్లో విద్యార్థులకు మాత్రలు వేయాలన్నారు. ఎంఈఓలు సంజీవయ్య, ఆర్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ ఊరేగింపు



కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులో జరుగుతున్న పోలేరమ్మ పొంగళ్లలో భాగంగా మంగళవారం కనకదుర్గమ్మ అమ్మ వారి చెట్టు నుంచి కొమ్మ కొట్టి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి పొంగళ్లు నిర్వహించి కనకదుర్గమ్మ అమ్మవారి గుడి నుంచి పోలేరమ్మ గుడి వరకు మహిళలు పొంగళ్లతో ఊరేగింపు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో భక్తులు భారీగా పాల్గొన్నారు.

సిబ్బందికి సమయపాలన తప్పనిసరి



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

లింగసముద్రం: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ శేషుబాబు అన్నారు. మండలంలోని మొగిలిచర్ల సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో సిబ్బంది హాజరుపట్టీని, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. డిజిటల్ అసిస్టెంట్లు సేవా సర్వీసెస్ పెంచాలని, సర్వీసెస్ అమౌంట్ ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు. సమస్యలపై వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనకు సచివాలయ ఉద్యోగులంతా హాజరుకావాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటిపన్ను వంద శాతం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆధునిక వ్యవసాయంతో అధిక లాభాలు

కొండపి: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ కె.అన్నపూర్ణ తెలిపారు. మండలంలోని చిన కండ్లగుంట, పెట్లూరు గ్రామాల్లో రైతులకు మంగళవారం జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీడీఏ అన్నపూర్ణ మాట్లాడుతూ.. పంటల సాగులో నూతన పద్ధతులు, సస్యరక్షణ గురించి వివరించారు. డీఆర్‌సీ అధికారిణులు శైలజ, వెంకటశేషమ్మ, సింగరాయకొండ ఏడీఏ నిర్మలకుమారి, ఏఓ డి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

హనుమంతునిపాడు: వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆర్‌బీకేల్లో వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయాధికారి కేవీ రమణ అన్నారు. ఒంగోలు నుంచి బదిలీపై వచ్చిన వ్యవసాయాధికారి కేవీ రమణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ బాధ్యతలు గోపిక్రిష్ణ విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు చేయాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, రైతు భరోసా కేంద్రాలో అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువులు ఎంత స్టాక్ ఉన్నది అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి ఏఓ గోపిక్రిష్ణా, వీఏఏలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మూరక ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ సందీప్ అన్నారు. స్థానిక ఆస్పత్రిలో మంగళవారం ఆరోగ్య సిబ్బందికి ఆశావర్కర్లకు సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ఉపకేంద్రంలో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీలు సమయపాలన పాటించకుండా విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ 10న నిర్వహించే నులిపురుగుల మాత్రల పంపిణీ విజయవంతం చేయాలయాన్నారు. సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

కనిగిరి రూరల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని, డయాలసిస్ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. మెరుగైన వసతులు, సౌకర్యాలు, అధునాతన పరికరాలతో వైద్యశాలలో మౌలిక వసతుల కల్పన చేస్తున్నట్లు చెప్పారు. వైద్య సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలన్నారు. రోగులతో ఆప్యాయతగా పలకరించి, మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందించినప్పుడే ప్రభుత్వ ఉద్దేశం నెరవేరుతుందన్నారు. ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ అబ్దుల్ కలాం, వైఎస్సార్ సీపీ యూత్ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ రసూల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశు కిసాన్ క్రెడిట్ కార్డుతో లబ్ధి

టంగుటూరు: పశు కిసాన్ క్రెడిట్ కార్డుతో రైతులు లబ్ధి పొందవచ్చని పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి పేర్కొన్నారు. మండలంలోని ఎం.నిడమానూరు గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా సర్వీసు ఫౌండేషన్, జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుపోషకులకు అవగాహన సదస్సు, ఉచిత పశువైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సుధీర్‌బాబు అధ్యక్షత వహించారు. జేడీ డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో అమలవుతున్న పథకాల గురించి పశుపోషకులకు వివరించారు. ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు చుంచు శేషయ్య మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చాలా కార్యక్రమాలు రైతులకు ఉపయోగపడే విధంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌బాబు, డీడీ డాక్టర్ పద్మావతి, ఏడీడీ డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ అనీల్, పశు వైద్య సిబ్బంది, ఫౌండేషన్ వారు డాక్టర్ చంద్రశేఖర్, నాగేశ్వరరావు, మండవ శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, వాకా బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అడ్మిషన్లకు దరఖాస్తు తేదీ పొడిగింపు

కనిగిరి రూరల్: 2023–24 విద్యా సంవత్సరానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ దరఖాస్తు తేదీని పొడిగించినట్లు కో ఆర్డినేటర్ కోటపాటి నరేష్‌రాజ తెలిపారు. ఇంటర్, డిప్లమా, తత్సమాన అర్హత కల్గిన విద్యార్థులంతా డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, కోర్సుల్లో అడ్మిషన్ల కోసం అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అడ్మిషన్ల కోసం ఆగస్టు 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టూడెంట్ సపోర్ట్ సెంటర్, ఫోన్ నెంబర్ 7382929690ను సంప్రదించాలని కోరారు.